సాక్షి
అనంతపురం
శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



కిలో టమాట రూ.26

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.15, సరాసరిన రూ.21 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.5°/24.2°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బదిలీల గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియ గడువును ఈనెల 22 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను (జీఓ 90) ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ గురువారం జారీ చేశారు. బదిలీల ప్రక్రియకు తొలుత ఆగస్టు 31 వరకు గడువు విధించారు. అటు తరువాత సెప్టెంబరు 15 వరకు పొడిగించారు. తాజాగా ఈ నెల 22 వరకు మరోసారి పొడిగించడం గమనార్హం. 23వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం అమలులోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి బదిలీలకు కూడా ఈనెల 30 వరకూ గడువు పొడిగించారు.

యాడికి కానిస్టేబుల్‌కు ఆసియా టాలెంట్ అవార్డు



కానిస్టేబుల్ విష్ణు భగవాన్ (ఫైల్)

యాడికి: మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న విష్ణుభగవాన్ ఆసియా టాలెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. పురాతన నాణేలు సేకరించే వారిని ప్రోత్సహిస్తూ మలేషియా దేశానికి చెందిన ఓ సంస్థ ఈ అవార్డును ఏటా అందజేస్తోంది. ప్రపంచ దేశాలకు చెందిన నాణేలతో పాటు రాజుల కాలానికి చెందిన 5 వేలకు పైగా నాణేలను సేకరించినందుకు గానూ విష్ణుభగవాన్‌ను అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం సంస్థ నుంచి విష్ణుభగవాన్‌కు సందేశం అందింది. సెప్టెంబర్ 22న మలేషియా దేశంలో జరిగే ఓ కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేయనున్నారు. విష్ణుభగవాన్‌ను సీఐ ఈరన్న, సహచరులు అభినందించారు.

గొర్రెల సహకార యూనియన్ పీఐ పదవీకాలం కొనసాగింపు

అనంతపురం అగ్రికల్చర్: గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల జిల్లా యూనియన్ పర్సన్ ఇన్‌చార్జ్ (పీఐ) పదవీకాలం పొడిగిస్తూ ఆ శాఖ డైరెక్టరేట్ నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పాలక వర్గాల గడువు ముగియడంతో యూనియన్‌కు పర్సన్ ఇన్‌చార్జ్‌గా పశుశాఖ అనంతపురం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

రైల్వే కార్మికుల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

- డిసెంబర్ 4,5,6 తేదీల్లో పోలింగ్

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు కోసం డిసెంబర్ 4,5,6వ తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు డీపీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. డివిజన్ వ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల్లో రహస్య బ్యాలెట్ ఓటింగ్ ద్వారా నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ నెల 18న ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 25లోపు నామినేషన్ ప్రతాలు దాఖలు చేయాలి. పరిశీలన అనంతరం నవంబర్ 14న పోటీలో ఉన్న వారి తుది జాబితా ప్రకటిస్తారు. డిసెంబర్ 4 నుంచి మూడు రోజు పాటు జరిగే ఎన్నికల్లో మొదటి రెండు రోజులు ఓపెన్ లైన్‌లో పని చేసేవారు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. రన్నింగ్ స్టాఫ్‌కు మాత్రం ఈ రెండు రోజులతోపాటు 6వ తేదీ కూడా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 12న ఉంటుంది. ఎన్నికల నిర్వహణకు ఇన్‌చార్జ్ ఆఫీసర్‌గా సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహన్, కో ఆర్డినేషన్ ఆఫీసర్‌గా రంజిత్‌కుమార్, ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్‌గా జీఆర్ జగదీష్‌కుమార్‌ను ఏర్పాటు చేశారు.

బరువుతో పోరాటం

- పెరుగుతున్న ఊబకాయుల సంఖ్య
- జిల్లాలో 40 శాతం మందికి పైగా అధిక బరువు సమస్య
- చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పులతో సతమతం
- మధుమేహం, గుండె జబ్బుల బారిన పడుతున్న వైనం
- గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించిన మాయదారి సమస్య
- జీవనశైలిలో మార్పులతో గట్టెక్కవచ్చంటున్న నిపుణులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వ్యవసాయాధారిత జిల్లాగా పేరొందిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పుడు లక్షలాది మంది బరువుతో పోరాటం చేస్తున్నారు. శరీరానికి మించిన బరువు కారణంగా పుట్టుకొస్తున్న సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ అధిక బరువు సమస్య పెద్ద ఇబ్బందిగా పరిణమించింది. ఎన్‌ఐఎన్ (జాతీయ పోషకాహార సంస్థ) అంచనాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 42 శాతం మంది పురుషులు, 38 శాతం మందికి పైగా మహిళలు అధిక బరువు సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ 18 శాతం పైగా సమస్య పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. సమతుల ఆహారం, వ్యాయామం లాంటి వాటిపై అవగాహన లేకపోవడంతో శరీరానికి మించిన బరువు కొత్త సమస్యలకు దారితీస్తోంది.

కొంపముంచుతున్న ఆహార అలవాట్లు..

ఆహార అలవాట్లలో పెనుమార్పులే అధిక బరువు సమస్యకు దారితీస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ప్యాకెట్‌లలో నెలల తరబడి నిల్వ ఉంచిన ఆహారం ఊరూరా విస్తరించింది. నూనెల్లో మునిగి తేలిన ఆహారమూ అందుతోంది. ఈ క్రమంలో ఉప్పు, చక్కెర వాడకం ఇబ్బంది పెడుతోంది. హోటల్ తిండి మరింతగా బరువు పెంచుతోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 9 వేలకు పైగా గుండెపోటు కేసులు నమోదవుతున్నాయి. దీనికితోడు తగిన వ్యాయామం చేయకపోవడం కొంపముంచుతోంది. ఉమ్మడి జిల్లాలో 70 శాతం మంది వ్యాయామం చేయడం లేదని తెలుస్తోంది.



- అనంతపురం నగరానికి చెందిన చలపతిరావుకు 40 ఏళ్లు. నియంత్రణ లేని తిండితో బరువు వంద కిలోలు దాటారు. ఇటీవల ఉన్నఫళంగా మోకాళ్ల నొప్పులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో డాక్టర్ దగ్గరికెళితే నొప్పులు తగ్గేందుకు మందులు రాసిచ్చిన ఆయన.. 25 కేజీల బరువు కూడా తగ్గాలని సూచించారు.
- ఛాతీలో నొప్పిగా ఉందంటూ ఇటీవల గుంతకల్లుకు చెందిన మహబూబ్ బాష అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. అన్ని పరీక్షలు నిర్వహించిన డాక్టర్.. ఉండాల్సిన బరువు కంటే మించి ఉండటంతోనే సమస్య వచ్చి పడిందని తేల్చారు. వ్యాయామం చేయడం లేదని వెల్లడైంది.అందుకే గుండె కవాటాలు మూసుకుపోయాయని మహబూబ్ బాషకు డాక్టర్ సెలవిచ్చారు.

ఉమ్మడి రాయలసీమ జిల్లాల్లో ఊబకాయుల శాతం ఇలా

జిల్లా	మహిళలు	పురుషులు
అనంతపురం	38.42	42.03
కర్నూలు	37.99	40.76
వైఎస్సార్	39.09	41.44
చిత్తూరు	40.01	43.70

ఎప్పటికైనా ప్రమాదమే



ఇటీవలి కాలంలో చాలామంది ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్నారు. జీవనశైలిలో వచ్చిన పెనుమార్పులే దీనికి కారణం. షుగర్, హార్ట్‌స్ట్రోక్, థైరాయిడ్ వంటివన్నీ బరువు ఎక్కువ ఉన్నవారికి వచ్చే అవకాశం ఉంటుంది. ఆహారం, వ్యాయామంలో మార్పులు తెచ్చుకోగలిగితే ఇలాంటి వారు సాధారణ స్థితికి రావచ్చు.

– డా.వంశీకృష్ణ, గుండె వైద్య నిపుణులు



సమస్యలెన్నో..

- శరీరానికి మించి బరువు ఉంటే చిన్న వయసులోనే మోకాళ్ల నొప్పులు వస్తాయి.
- కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది.
- గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువ.
- మధుమేహం రావడానికి అవకాశాలు కూడా ఊబకాయుల్లోనే అధికం.
- అనారోగ్యానికి గురైనప్పుడు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఒక్కోసారి సమస్య తీవ్రంగా ఉంటుంది.



బరువు పెరగకుండా ఉండాలంటే..

- వేపుళ్లతో కూడిన వంటకాలు తగ్గించి ఉడికించిన కూరగాయలు తినాలి.
- కార్బోహైడ్రేడ్‌లు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్‌లు, చిప్స్‌లకు దూరంగా ఉండాలి.
- రోజూ కనీసం 40 నిమిషాలు నడక.. వారంలో 5 రోజులైనా వ్యాయామం చేయాలి.
- నూనెలు, ఉప్పు, చక్కెరలు తక్కువగా వాడితే బరువును నియంత్రించుకోవవచ్చు.
- ఫైబర్, కాల్షియం ఎక్కువగా లభించే ఆకుకూరలు తినడం వల్ల బరువునుంచి బయట పడవచ్చు.

విశాలా ఫెర్రర్‌కు స్పెయిన్ వర్సిటీ డాక్టరేట్



విశాలా ఫెర్రర్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం: స్పెయిన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ బూర్గోస్ నుంచి ఆర్డీటీ విమెన్ వింగ్ డైరెక్టర్ విశాలా ఫెర్రర్ డాక్టరేట్ పొందారు. ఈ మేరకు గురువారం ఆమె స్పెయిన్ విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ అందుకున్నారు. దేశంలో మహిళల హక్కులు, సమానత్వంపై ఆమె చేసిన విశేష కృషిని గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆర్డీటీ సంస్థను స్థాపించి నిరుపేదలకు విద్య, వైద్యం, క్రీడలు, హౌసింగ్ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేసిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, ఆయన సతీమణి అన్నే ఫెర్రర్‌లకు కూడా ఈ యూనివర్సిటీ డాక్టరేట్‌లను ప్రదానం చేసింది. నేడు విశాల ఫెర్రర్‌కు డాక్టరేట్ రావడం పట్ల ఉమ్మడి జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటిని నిర్మించుకోకపోతే రద్దు



టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: గృహ నిర్మాణానికి అనుమతి లభించినప్పటికీ నిర్మించుకోని పక్షంలో రద్దు చేస్తామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఇప్పటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులకు విషయం తెలియజేయాలని ఆదేశించారు. స్పందించని పక్షంలో నోటీసులు ఇవ్వాలని సూచించారు. గృహ నిర్మాణాలు, ఈ–పంట నమోదు అంశాలపై కలెక్టర్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాల్సి ఉందన్నారు. ఇప్పటికే గృహ నిర్మాణాలకు అనుమతులు లభించినప్పటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల జాబితాను ఆర్డీఓలు, తహసీల్దార్లు హౌసింగ్ శాఖ ద్వారా తెప్పించుకోవాలని చెప్పారు. గృహాన్ని నిర్మించుకోకపోతే రద్దు చేస్తామనే విషయాన్ని వీఆర్‌ఓల ద్వారా లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. అప్పటికీ స్పందించని పక్షంలో నోటీసులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఈ–పంట నమోదు ఈనెల 15 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కౌలు రైతులను ఆదుకుంటాం

- కలెక్టర్ వి.వినోద్‌కుమార్



ఆకాశవాణి కేంద్రంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. కౌలు పంట సాగుదారు హక్కు ప్రతం అంశంపై కలెక్టర్ గురువారం అనంతపురం ఆకాశవాణి కేంద్రం నుంచి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి రైతులు కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకొచ్చారు. కలెక్టర్ సమాధానమిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌలు రైతులకు సంబంధించిన అగ్రిమెంట్‌పై గ్రామ రెవెన్యూ అధికారుల నుంచి కౌంటర్ సంతకం పొంది ఉండాలన్నారు. భూ యజమాని నుంచి అగ్రిమెట్ చేసుకునే రోజు నుంచి 11 నెలల వరకు వర్తిస్తుందన్నారు. ఖరీఫ్, రబీ రెండు పంటలకూ వర్తించే విధంగా ఉంటాయన్నారు. 11 నెలల తరువాత రెన్యూవల్ చేసుకోవచ్చన్నారు. నష్ట పరిహారం కౌలు రైతుకే అందేలా చూడడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

టేకు చెట్లు నాటండి

జిల్లా వాతావరణం ఉద్యాన పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని, రైతులు ఆ దిశగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా పొలం హద్దుల వెంబడి టేకు చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టాలన్నారు. భూ సమస్యలపై కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 8500292992 నంబర్‌కు వాట్సాప్, మెసెజ్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. cccantp@gmail.comకు మెయిల్ ద్వారా తెలిపితే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకులో పంట రుణాలకు సంబంధించి సమస్యలుంటే ఎల్‌డీఎం నర్సింగ రావు (ఫోన్ నంబరు 9440905431)ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గోడౌన్ల నిర్మాణాలు పూర్తి చేయండి

బుక్కరాయసముద్రం: బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల నిర్మాణాలు వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవర కొండ వద్ద ఉన్న బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల (ఎంపీఎఫ్‌సీ)ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాముల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తాం

- ఐఏబీ సమావేశం వాయిదాలు వేయడం బాధాకరం
- జిల్లాలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అందరూ కలసికట్టుగా పని చేస్తామని, ఎన్నికల్లో పార్టీ ఓటమిపై సమీక్షించుకుంటామని, భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా గురువారం అనంతపురంలోని ఆయన స్వగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిపోయాక కుంగిపోవడం, గెలిచాక పొంగిపోవడం తమకు తెలియదన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పేద, బడుగు, బలహీన వర్గాలకు, రైతాంగానికి తోడుగా ఉంటామన్నారు.

ఐఏబీ సమావేశం వాయిదా బాధాకరం..

విజయవాడలో వరద సమస్య ఉందని కూటమి ప్రభుత్వం చెబుతోందని, మరి జిల్లాలో నెలకొన్న కరువు సర్కారుకు కన్పించడం లేదా అని అనంత ప్రశ్నించారు. వరదను సాకుగా చూపి జిల్లా రైతాంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం పదే పదే వాయిదాలు వేయడం బాధాకరమన్నారు. తక్షణం సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, తేదీలు ఖరారు చేయాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కూడా చర్చించినట్లు తెలిపారు. టీబీ డ్యాం నిండుకుండలా ఉన్నా ఆయకట్టుకు నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏకంగా 5 లక్షలకు పైగా ఎకరాల్లో ఈ సారి రైతులు విత్తనం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేసిన అరకొర పంట కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. జిల్లాలో 68 శాతం, శ్రీ సత్యసాయి జిల్లాలో 52 శాతం వరకు మాత్రమే పంటల సాగు చేశారన్నారు. ఈ ఖరీఫ్‌లో జూలై, ఆగస్టుల్లో విత్తనాలు వేయని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇవ్వడం మినహా చేసిందేమీ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలపై స్పష్టమైన ప్రకటన చేయలేకపోతున్నారన్నారు. హామీలను నెరవేర్చలేక చేతులెత్తేసిన ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తోందని మండిపడ్డారు.

శాంతిభద్రతలు అదుపు తప్పాయి..

జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకుంటామని, ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

రాప్తాడులో తుపాకుల సంస్కృతి మొదలైంది

- అరాచకాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్
- పార్టీ కార్యకర్తను పరామర్శించడానికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు



శాంతిభద్రతలను కాపాడాలంటూ డీఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

రాప్తాడురూరల్: రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ఉన్న తుపాకులు, బాంబుల సంస్కృతి కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ నేడు మొదలైందని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం కుంటిమద్దిలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడిపై గన్, కత్తితో హత్యాయత్నానికి పాల్పడడం, నసనకోటలో ఓ నాయకుడి ఇంటిపై రాళ్లదాడి, కొన్ని గ్రామాల్లో యువతను బహిష్కరించడం తదితర ఘటనలు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయని వాపోయారు. నియోజకవర్గంలో పూర్తిగా అదుపు తప్పిన శాంతిభద్రతలపై ధర్మవరం డీఎస్పీ, రామగిరి సీఐలను కలిసి విన్నవించి, అక్కడి నుంచి బాధితులను పరామర్శించేందుకు గురువారం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ అనంతపురం నుంచి బయలుదేరారు. సమాచారం అందుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రెడ్డప్ప, శ్రీధర్, నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ, సిబ్బంది రాప్తాడు మండలం మరూరు టోల్‌గేట్ వద్ద అడ్డుకున్నారు. వెళ్లడానికి వీలులేదంటూ నిలిపేశారు. పోలీసులతో గోరంట్ల మాధవ్ వాగ్వాదం చేసినా లాభం లేకపోయింది. అనుమతులు లేవని రామగిరి మండలానికి వెళ్లడానికి వీలులేదంటూ కరాఖండిగా చెప్పేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముద్ర వేసి అర్హులైన వారికి పింఛన్లు నిలిపేయడం దుర్మార్గం అన్నారు. పారదర్శకంగా పని చేయాల్సిన అధికారులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారన్నారు. చివరకు సబ్సిడీ విత్తనాల సరఫరాలోనూ రాజకీయం చేస్తున్నారన్నారు. తమ పార్టీ కార్యకర్తల భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారన్నారు. టీడీపీ నాయకులకు భయపడి చాలా గ్రామాల్లో యువత గ్రామాలు వదిలి బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకున్నారని వాపోయారు. పార్టీ కార్యకర్తలను కలిసేందుకు వెళ్తున్న తనను అడ్డుకోవడం సరికాదన్నారు. రానున్న రోజుల్లో కచ్చితంగా బాధిత కుటుంబాలను పరామర్శిస్తానన్నారు. వారికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ భరోసా ఇచ్చారు.

పరుగుల వరద

- దులీప్ ట్రోఫీ మ్యాచుల్లో బ్యాటర్ల వీరవిహారం
- సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్



మ్యాచును వీక్షిస్తున్న అభిమానులు



బ్యాటింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్

అనంతపురం: దులీప్ ట్రోఫీ రెండో రౌండ్ మ్యాచుల్లో పరుగుల వరద పారింది. బ్యాటర్లు వీర విహారం చేశారు. గురువారం అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామంలో నాలుగు జట్లు తలపడ్డాయి. ఇండియా–బీతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్లందరూ సమష్టిగా రాణించడంతో ఇండియా–సీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. సెంట్రల్ కాంట్రాక్టు కోల్పోయి మళ్లీ జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న ఇషాన్ కిషన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. 111 (126 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో అదరగొట్టాడు. బాబా ఇంద్రజిత్ 78 (136 బంతుల్లో 9 ఫోర్లు), సాయి సుదర్శన్ 31(37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), రజత్ పటిదార్ 40(75 బంతుల్లో 8 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం రుతురాజ్ గైక్వాడ్ 46 (50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), మానవ్ సుతార్ (8) క్రీజులో ఉన్నారు. ఇండియా –బీ బౌలర్లలో ముకేష్ కుమార్ 3, నవదీప్ సైనీ, రాహుల్ చాహర్ చెరో వికెట్ పడగొట్టారు.

ఆదుకున్న ములాని, తనుష్..


మరో గ్రౌండ్‌లో ఇండియా–డీతో జరుగుతున్న మ్యాచులో ఇండియా–ఏ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు పెద్దగా రాణించలేదు. 93 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోగా.. ఏడో స్థానంలో వచ్చిన శామ్స్ ములాని 88 నాటౌట్ (158 బంతుల్లో 7 ఫోర్లు) జట్టును ఆదుకున్నాడు. ఎనిమిదో స్థానంలో వచ్చిన తనుష్ కోటియన్ 53 (80 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి జట్టుకు గౌరవ ప్రదమైన స్కోరు అందించాడు. రియాన్ పరాగ్ (37) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఓపెనర్లు ప్రథమ్ సింగ్ (7), మయాంక్ అగర్వాల్ (7), తిలక్‌వర్మ (10), శాశ్వత్ రావత్ (15) నిరాశపరిచారు. కుమార కుశాగ్ర 28 పరుగులు చేశారు. ములానితో పాటు ఖలీల్ అహమ్మద్ (15) క్రీజులో ఉన్నారు. ఇండియా–డీ బౌలర్లలో హర్షిత్ రాణా, విద్వత్ కావేరప్ప, అర్షదీప్ సింగ్ రెండేసి వికెట్లు పడగొట్టగా, శరన్ష్ జైన్, సౌరభ్‌కుమార్ చెరో వికెట్ తీశారు.

సర్దుబాటు.. తలపోటు!

☛ అనంతపురం కొత్తూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉర్దూ టీచరుగా పని చేస్తున్న కలిముల్లాను మిగులుగా చూపించి పాతూరు నంబర్–2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సర్దుబాటు చేశారు. అక్కడ ఉర్దూ పోస్టే లేదు. ఈయనను తెలుగు సబ్జెక్టుకు కేటాయించారు. ఆయన తెలుగు ఎలా బోధిస్తాడో అధికారులకే తెలియాలి.

☛ కుందుర్పి మండలంలో మండల స్థాయి సర్దుబాటు అయిన తర్వాత ఇంకా 14 మంది టీచర్లు మిగిలారు. కానీ మండల స్థాయిలో ఇంకా 27 ఉపాధ్యాయులు అవసరమున్నారు. అక్కడ నియమించకుండా డివిజనల్ స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో మారుమూల ప్రాంతమైన కుందుర్పి మండలంలో విద్యాబోధన కుంటు పడే ప్రమాదముందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నా విద్యాశాఖలో వినేనాథుడే కరువయ్యాడు.

☛ అనంతపురం నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టులో ఇద్దరు టీచర్లను మండలస్థాయిలో మిగులుగా చూపించారు. వీరిలో ఒక టీచరు సీనియార్టీ విషయంపై గ్రీవెన్స్ పెట్టుకుంది. ఆమె సమస్య పరిష్కరించకుండా పక్కన పెట్టేశారు. మరొక టీచర్‌ను వేరే స్కూల్‌కు సర్దుబాటు చేశారు. డివిజన్ స్థాయిలో పై ఇద్దరు కాకుండా మూడో టీచర్‌ను మిగులుగా చూపించి ఉప్పరపల్లి స్కూల్‌కు సర్దుబాటు చేశారు. తాను సీనియర్ అంటూ ఈ టీచర్ రోజూ డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.



- విద్యార్థులకు ఉపయోగపడని టీచర్ల పని సర్దుబాటు
- ఉపాధ్యాయులకూ తీవ్ర ఇబ్బందులు కల్గిస్తున్న వైనం
- ఒక సబ్జెక్టు బోధిస్తుంటే మరో సబ్జెక్టుకు సర్దుబాటు
- అనుభవం లేని బాధ్యతలు అప్పగించిన అధికారులు
- కొత్త సబ్జెక్టులు బోధించలేక తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చుకున్న' చందంగా తయారైంది టీచర్ల పని సర్దుబాటు. ఈ ప్రక్రియ చాలా చిన్నది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువ సంఖ్యలో టీచర్లు ఉన్న చోట నుంచి ఎక్కువ మంది విద్యార్థులుండి తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులుండే పాఠశాలలకు తాత్కాలికంగా సర్దుబాటు చేసి పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలన్నదే 'పని సర్దుబాటు లక్ష్యం' టీచర్లు, విద్యార్థుల నిష్పత్తిని పరిశీలించి ఆయా మండలాల్లో ఎంఈఓలు, డివిజన్ స్థాయిలో డెప్యూటీ డీఈఓలు టీచర్లను పని సర్దుబాటు చేయడం ఏటా జరుగుతున్న తంతే. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఆన్‌లైన్ పేరుతో రాష్ట్ర స్థాయిలో చేపట్టి తీవ్ర గందరగోళానికి తెర తీశారు. టీచర్ల సర్దుబాటు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. విద్యార్థులకు ఉపయోగపడకపోగా టీచర్లనూ తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనికితోడు జిల్లా, మండలస్థాయి అధికారులు ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూ సాధారణ టీచర్లను బలి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం 513 మంది టీచర్లను సర్దుబాటు చేయగా వారిలో 485 మంది జాయిన్ అయినట్లు అధికారులు చెబుతున్నారు.

తెలుగు టీచర్ ఇంగ్లిష్ ఎలా బోధిస్తారు?

ఒక స్కూల్‌లో పని చేస్తున్న తెలుగు టీచర్‌ను పని సర్దుబాటులో భాగంగా మరో ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టు బోధించాలంటూ సర్దుబాటు చేశారు. అదికూడా ఇంగ్లిష్ మీడియంలో బోధించాలంటూ ఆదేశాలిచ్చారు. సీబీఎస్ఈ సిలబస్‌లో సోషల్ సబ్జెక్టు బోధించడం తమవల్ల కాదంటూ ఆ తెలుగు టీచర్లు లబోదిబోమంటున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అలాగే సోషల్ సబ్జెక్టు టీచర్‌ను తెలుగు బోధించాలంటూ అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి స్కూల్‌కు సర్దుబాటు చేశారు. వ్యాకరణ అంశాలను బోధించడం తమవల్ల కాదంటూ సోషల్ టీచర్లు వాపోతున్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఇదే సమస్య ఉంది. దాదాపు 70 మందికి పైగా టీచర్లు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు.

సబ్జెక్ట్ టీచర్ల కొరత తీరలేదు



పని సర్దుబాటు వల్ల సబ్జెక్టు టీచర్ల కొరత తీరడం లేదు. ఉపాధ్యాయులకు వెత తప్పలేదు. చాలాచోట్ల ఎస్జీటీలనే బలవంతంగా సబ్జెక్టు టీచర్లుగా సర్దుబాటు చేస్తున్నారు. చాలా మండలాల్లో ఎంఈఓలు గ్రీవెన్స్ క్లియర్ చేయకుండానే కౌన్సెలింగ్ చేపట్టారు. మిగులుగా లేని టీచర్లను చివరిరోజు మిగులుగా చూపించి వారి అభిప్రాయం తీసుకోకుండానే బలవతంతంగా సర్దుబాటు చేసేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకుండాపోయింది.

– ఆర్.శ్రీనివాసనాయక్ ఏపీటీఎఫ్–1938 జిల్లా ప్రధానకార్యదర్శి

డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు



టీచర్ల పని సర్దుబాటులో అనేక సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. బయాలజీ అసిస్టెంట్‌ను ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా, తెలుగు అసిస్టెంట్‌ను సోషల్ అసిస్టెంట్‌గా సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసం. ముందుగా పదోన్నతులు కల్పించి తర్వాత సర్దుబాటు చేయాలి. అప్పుడే విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. టీచర్లకు ఇబ్బందులు ఉండవు.

– సిరాజుద్దీన్ ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అసంబద్ధమైన సర్దుబాటు



టీచర్ల పని సర్దుబాటుతో విద్యార్థులకు న్యాయం జరగడం లేదు. మరోవైపు టీచర్లకూ ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సరిహద్దు మండలాల్లో మండలస్థాయిలో టీచర్లు అవసరమున్నా వాటిని భర్తీ చేయకుండా...డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ నిర్వహించడం వల్ల ఆయా మండలాల్లో బోధన కుంటుపడే ప్రమాదముంది. సబ్జెక్టు టీచర్లను కాకుండా ఇతర టీచర్లను సర్దుబాటు చేయడం వల్ల బోధన ఇబ్బందిగా మారనుంది.

– రమణారెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

అశాస్త్రీయం



జిల్లాలో టీచర్ల పని సర్దుబాటు కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా తయారైంది. ఈ సర్దుబాటు ప్రక్రియ పూర్తిగా అశాస్త్రీయంగా ఉంది. ఇంగ్లిష్ టీచర్‌ను తెలుగు, హిందీ చెప్పమనడం, సోషల్ టీచర్‌ను తెలుగు, గణితం చెప్పాలంటూ బలవంతంగా సర్దుబాటు చేశారు. వారు సబ్జెక్టు కాకుండా ఇతర సబ్జెక్టులను ఎలా డీల్ చేస్తారో విద్యార్థులకు ఎంత మేలు జరుగుతుంతో అధికారులే ఆలోచించాలి.

– నాగిరెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు

అంతా గందరగోళం



ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఆలోచన మంచిదే. ఆచరణలో పూర్తిగా విఫలమయ్యారు. మండలంలోనే సర్దుబాటుకి ఆవకాశం ఉండి కూడా ప్రభుత్వం కొత్త ఆలోచనలతో తీవ్ర గందరగోళానికి తెర తీసింది. ఈరోజు ఏ ఉపాధ్యాయుడు ఏ సబ్జెక్టుని బోధిస్తున్నాడో అర్థం కాని పరిస్థితి. పిల్లలకు న్యాయం చేయలేకపోతున్నామనే బాధతో ఉపాధ్యాయుడు సర్దుబాటు చేసిన స్కూలుకి బలవంతంగా వెళ్తున్నాడు.

– దెగావత్ రవీంద్రనాథ్, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

క్లుప్తంగా

విద్యార్థిని ఆత్మహత్య



పావని(ఫైల్)

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడులో ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజుల రెడ్డి, రమాదేవి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె పావని(19) కొయంబత్తూరులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వినాయక చవితి పండుగ ఉండటంతో ఇంటికి వచ్చింది. అయితే చదువుకోవడం ఇష్టం లేని ఆమె గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్టోర్ రూంలోకి వెళ్లి ఉరి వేసుకుంది. ఉదయం గమనించిన తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ హేమాద్రి పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులబాధతో రైతు..



ఓబిలేసు(ఫైల్)

గార్లదిన్నె: మర్తాడుకు చెందిన ఓ రైతు అప్పుల బాధ తాళలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఓబిలేసు(35) తనకున్న 3 ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేస్తూ జీవనం సాగించేవాడు. పంట పెట్టుబడి కోసం ఇతరుల వద్ద రూ.6 లక్షల దాకా అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలోనని మధనపడేవాడు. ఈక్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సయమంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య ధరణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు.

లైన్‌మన్ బలవన్మరణం



రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: ఆరోగ్య సమస్యలతో విద్యుత్ లైన్‌మన్ ఉరేసుకుని ఆత్యహత్య చేసుకున్నాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం కోనాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు(58) కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. కళ్యాణదుర్గంలోని పార్వతినగర్‌లో నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

- అక్రమార్కులకు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండ!



రేషన్ బియ్యంతో పట్టుబడిన వాహనం

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో బుధవారం రాత్రి అక్రమంగా తరలివెళ్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. గుత్తి మండలం కరిడికొండకు చెందిన రామచంద్ర, సురేష్ బుధవారం రాత్రి టాటా ఏస్ వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. స్పందించిన పోలీసులు పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో వెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. డ్రైవర్‌ను అరెస్ట్ చేసి వాహనంతోపాటు అందులో ఉన్న 47 ప్యాకెట్ల(ఒక్కో ప్యాకెట్ 60 కేజీలు) బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా టీడీపీకి చెందిన నియోజకవర్గ ప్రజాప్రతినిధితోపాటు నేతల అండదండలతోనే అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ నాయకుడి పొలంలో పట్టుబడిన రేషన్ బియ్యం



రేషన్ బియ్యాన్ని సీజ్ చేస్తున్న పోలీసులు

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్‌కు చెందిన టీడీపీ నేత మాకాని వెంకటేశులు పొలంలో అక్రమంగా నిల్వ ఉంచిన 180 ప్యాకెట్లు (7టన్నులు) రేషన్ బియ్యం గురువారం రాత్రి పోలీసులకు పట్టుబడింది. అనంతపురం స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పొలంలో దాచిన బియ్యం ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించడంతోపాటు వెంకటేశులుపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

1,892 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ప్రక్రియలో భాగంగా గురువారం నాటికి 1,892 క్వింటాళ్ల కోసం 6,016 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. విత్తన పంపిణీ కూడా ప్రారంభమైందన్నారు. వర్షాభావం వల్ల ఖరీఫ్ సాగు 72 శాతానికి పరిమితం కాగా, మిగతాది ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 80 శాతం రాయితీతో ఉలవలు, పెసలు, అలసంద, కొర్ర, మినుము, జొన్నలు పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. 25 మండలాల్లో ప్రత్యామ్నాయ విత్తనాలకు రిజిస్ట్రేషన్లు, పంపిణీ కొనసాగుతోందన్నారు.

వెంగన్నపల్లిలో 17 మందిపై కేసు నమోదు

యాడికి: వెంగన్నపల్లిలో బుధవారం జరిగిన ఘర్షణకు సంబంధించి గురువారం 17 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీకి చెందిన భాస్కర్ రెడ్డి ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన 8మందిపై, టీడీపీకి చెందిన లక్ష్మీరంగారెడ్డి ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

అనంతపురం మెడికల్: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు బాల్య వివాహాల నియంత్రణపై ఇటీవల విడుదల చేసిన జీఓ(31, 39)లను వివరించారు. బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లదే కీలకపాత్ర అని అన్నారు. బాల్య వివాహాలతో మానసికంగా, శారీరకంగా, సామాజిక పరంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్, సీడీపీఓలు ధనలక్ష్మి, ఉమాశంకరమ్మ, చైల్డ్‌లైన్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

- పింఛన్ తప్ప ఏఒక్క హామీ నెరవేర్చలేదు
- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులైనా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఎన్నికల హామీల్లో పింఛన్ తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి వాటిని నేరవేర్చాలంటే భయమేస్తోందని సీఎం స్పష్టం చేశారన్నారు. అచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. వరద కష్టాల్లో ఉన్న విజయవాడ ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారన్నారు. ఇందులో భాగంగా మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో పాటు విజయవాడకు చెందిన ఇతర ముఖ్యనేతలను అరెస్టు చేయించడమే కాకుండా, తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దేశ ద్రోహం కేసు పెట్టాలని చంద్రబాబు చెప్పడం నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబు కుట్ర, కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

ఐఏబీ సమావేశం నిర్వహణలో నిర్లక్ష్యమా?

రాయలసీమ జిల్లాలకు తాగు,సాగునీటి కేటాయింపులు చేపట్టడానికి ఉద్దేశించిన సాగునీటి సలహా మండలి బోర్డు (ఐఏబీ) సమావేశం నిర్వహణలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ మండిపడ్డారు. శ్రీశైలం డ్యాం పూర్తిగా నిండి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారని, తుంగభద్ర జలాశయం ప్రస్తుతం ఓవర్‌ఫ్లో అవుతోందన్నారు. జిల్లా రైతాంగం నీటి కేటాయింపులపై ఎంతో ఆశగా చూస్తోందన్నారు. ఐఏబీ సమావేశాన్ని మూడోసారి వాయిదా వేయడం సరైంది కాదన్నారు. విజయవాడలో వరదలు సాకుగా చూపుతు రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు నీటి కేటాయింపులు జరగకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

అవినీతి సీఐ, ఎస్ఐలకు పోస్టింగ్‌లు

ఉరవకొండ సర్కిల్‌కు గతంలో అవినీతి, ఆరోపణలు ఎదుర్కొన్న సీఐ చిన్నగౌస్, ఎస్ఐ జనార్ధన్‌నాయుడులకు పోస్టింగ్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమైందని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సీఐగా విధులు నిర్వహించిన చిన్నగౌస్ ఎంతో మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. అలాంటి సీఐకు తిరిగి ఉరవకొండలో పోస్టింగ్ ఇస్తే ఇక మరింత రౌడీ రాజ్యంగా మారుతుందన్నారు. ఎస్ఐ జనార్ధన్‌నాయుడిపై లాకప్‌డెత్‌తో పాటు అనేక ఆరోపణలు ఉన్నాయని గుర్తు చేశారు. పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, సీనియర్ నాయకులు అశోక్, బసవరాజు, మూస్టురు సుంకన్న, ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు నరసింహులు, నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, కూడేరు, వజ్రకరూర్ కన్వీనర్లు రామచంద్రారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి నాయకులు కొడిగి గోవిందు, ఉస్మాన్, ఆసీఫ్, ఈడిగ ప్రసాద్, వడ్డే ఆంజినేయులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని ఉసురు తీసుకున్నాడు..



ఎరికల సునీల్ (ఫైల్)

రాప్తాడురూరల్: ఉద్యోగం రాలేదని తీవ్ర మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఉసురు తీసుకున్నాడు.ఈ విషాద ఘటన అనంతపురం రూరల్ మండలం ఎస్ఆర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..ఎస్ఆర్ కాలనీకి చెందిన లేట్ వెంకటేశులు, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఈశ్వరమ్మ కలెక్టరేట్‌లో అటెండెర్‌గా పని చేస్తోంది. పెద్దకుమారుడు అనిల్ వస్త్ర దుకాణం పెట్టుకున్నాడు. చిన్న కుమారుడు ఎరికిల సునీల్(22) ఎంబీఏ పూర్తి చేశాడు. ఏడాదిగా ప్రయత్నం చేస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడిపత్రి అర్బన్: స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని డివైడర్ వద్ద గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. మృతుడు యాచక వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని అర్బన్ సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కార్తీక్‌నాయక్ (ఫైల్)

వజ్రకరూరు: రాగులపాడు గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..పామిడి మండలం పాళ్యంతండాకు చెందిన కార్తీక్‌నాయక్(22) ఆటోలో గురువారం సాయంత్రం స్వగ్రామం నుంచి ఉరవకొండకు బయలుదేరాడు. రాగులపాడు గ్రామం సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువ వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో అతడు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి ప్రాణం తీసిన అతివేగం



మృతి చెందిన బాలాజీ

కంబదూరు: అతివేగం ఓ యువకుడి ప్రాణం తీసింది. వివరాలు..కదిరిదేవరపల్లికి చెందిన బాలాజీ(30) తిమ్మాపురం వద్ద ఉన్న సోలార్ కంపెనీలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం కంబదూరులో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అండేపల్లి–దేవరమాన్ల సమీపంలో అతివేగానికి బైక్ అదుపుతప్పి ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్పీ పోలీసులు

అనంతపురం సిటీ: స్థానిక హెచ్ఎల్సీ కెనాల్ సమీపంలోని గురువారం ఉదయం గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు పంజాబీ డ్రెస్‌తో ఉన్న ఆమె గ్రీన్ కలర్ లెగ్గిన్, డార్క్ గ్రే కలర్ ఓణీ, బ్లాక్ కలర్ చెప్పులు ధరించింది. జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తమ సిబ్బందితో ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించారు.

అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన



అర్ధనగ్న ప్రదర్శనలో కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి సరఫరా కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కార్మికుల జీతాలు చెల్లిస్తామని చెప్పిన నాయకులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి సరఫరా కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య



నూరుల్లా (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలో గురువారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు. పట్టణంలోని రామచంద్రలాడ్జి వెనుక వైపు వీధిలో ఉంటున్న నూరుల్లా(30) అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో కార్మికుడిగా పని చేసేవాడు. అయితే పట్టణంలోని కమ్మవారివీధికి చెందిన లారీ డ్రైవర్ నజీర్ భార్యతో నూరుల్లా సన్నిహితంగా ఉండేవాడు. గురువారం రాత్రి నూరుల్లా నజీర్ ఇంటి పరిసరాల్లో సంచరిస్తుండగా అనుమానం వచ్చిన నజీర్ నూరుల్లాను నిలదీశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో నజీర్ నూరుల్లాను బండరాయితో మోది చంపి అక్కడి నుంచి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కె.జనార్ధన్‌నాయుడు, అర్బన్, రూరల్ అప్‌గ్రేడ్ సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జార్ఖండ్ వాసి అదృశ్యం



అజయ్‌కుమార్ (ఫైల్)

గుత్తి: జక్కలచెరువు రైల్వే స్టేషన్‌లో జార్ఖండ్‌కు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. గుత్తి జీఆర్పీ ఎస్ఐ నాగప్ప వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన అజయ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి రైల్లో తిరుమల వెళ్లాడు. అక్కడ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని గత నెల 22న సొంత ప్రాంతానికి బయలుదేరాడు. జక్కలచెరువు రైల్వేస్టేషన్‌లో కిందకు దిగిన ఆయన తర్వాత కనిపించకుండా పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. గురువారం అతడి కుటుంబ సభ్యులు గుత్తి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపారు.

ఉరకలెత్తిన ఉత్సాహం



మ్యాచ్‌ను తిలకిస్తున్న ప్రేక్షకులు



ఇండియా-బీ, ఇండియా-సీ మధ్య మ్యాచ్‌లో ఓ దృశ్యం

దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ల సందర్భంగా అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామం గురువారం కిటకిటలాడింది. తమ అభిమాన క్రికెటర్లను చూసేందుకు పెద్ద సంఖ్యలో క్రికెట్ ప్రేమికులు విచ్చేశారు. ఉత్సాహంతో ఉరకలేశారు. మ్యాచులను చూసేందుకు అవకాశం కల్పించడంతో విద్యార్థులు పోటెత్తారు. స్టేడియంలో సందడి చేశారు. బ్యాటర్లు సిక్సులు, ఫోర్లు బాదిన సమయంలో డ్యాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఉత్సాహంలో విద్యార్థులు



స్టేడియంలో విభిన్న ప్రతిభావంత చిన్నారులు



డ్రమ్స్ వాయిద్యానికి డ్యాన్సులు చేస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

హామీలు అమలు చేయండి



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి రామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సోమశేఖర్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే గురువారం పలు రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందికి వినతిపత్రాలను అందజేశారు. పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని , ఇన్సూరెన్స్ ప్రకటించాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించకూడదని డిమాండ్ చేశారు.

16న ఓనం వేడుకలు

అనంతపురం కల్చరల్: కేరళీయులకు ప్రీతిపాత్రమైన ఓనం పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు నగరవాసులు సిద్ధమయ్యారు. ఈనెల 16న మొదటిరోడ్డులోని శ్రీకాశీవిశ్వేశ్వర కోదండరామాలయ ప్రాంగణంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 గంటలకు విశేష సుగంధ ద్రవ్యాభిషేకం, ఔషధ మూలికలతో అభిషేకం, హోమం అనంతరం అలంకార సేవలు ఉంటాయని ఆలయ ఈఓ రమేష్ బాబు, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అంధ గాయకురాలు

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి ఆధునిక సమాజంలో డబ్బు విలువ, ఆర్థిక అక్షరాస్యత గురించి పిల్లలకు అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని ట్రెల్లిస్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీకాంత్ వద్ల పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రత్యేక సామర్థ్యం ఉన్న, బహుముఖ ప్రతిభావంతులైన అంధ మహిళా గాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు డబ్బును ఎలా సంపాదిస్తారు, ఆర్థిక బాధ్యత యొక్క ప్రాముఖ్యత గురించి వారి అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. ఈ ప్రయోగాత్మక అనుభవం ఓ చురుకైన అభ్యాసాన్ని ప్రోత్సహిస్తుందని కోశాధికారి నందిని తెలిపారు. అంధ గాయకుల జీవిత పాఠాలు చాలా క్లిష్టమైనవని యాజమాన్య సభ్యులు అమిత ప్రియ పేర్కొన్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా



బీసీ కాలనీలో ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ పంచాయతీలో వారం రోజులుగా తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. ముఖ్యంగా సత్యసాయి నీటి సరఫరా సిబ్బంది సమ్మె చేస్తుండటంతో స్థానికులు తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. దీంతో మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ట్రాక్టర్ ద్వారా నీటి ట్యాంకులతో నీటని సరఫరా చేశారు.

విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఎంఓయూ పత్రాలు చూపుతున్న బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణకిశోర్

అనంతపురం రూరల్: తమ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిశోర్ అన్నారు. గురువారం పీవీకేకే కళాశాలలో యూనివర్సిటీ ఆఫ్ ఐజూ (జపాన్) ప్రతినిధులతో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణకిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎంఓయూతో ఐజూ యూనిర్సిటీలో అందించే బోధన సైతం విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పల్లె సింధూరరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతకు అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి అభినందనల వెల్లువెత్తాయి. అధ్యక్షునిగా నియామకమైన తర్వాత తొలిసారి జిల్లాకు వచ్చిన ఆయన్ను గురువారం పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో కలసి పుష్పగుచ్ఛం, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీ అధ్యక్షున్ని కలసిన వారిలో మాజీ మంత్రి శంకర నారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరాంజనేయులు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు లీలావతి, రాధా, ఇసాక్, రహంతుల్లా, అనిల్‌కుమార్ రెడ్డి, దుర్గాదేవి, శేఖర్‌బాబు, సంపంగి రామాంజినేయులు, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, తాడిపత్రి చింత వెంకటరమణ స్వామి ఆలయ మాజీ ఛైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ ఓబి రెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, నాయకులు వెన్నం శివరామిరెడ్డి, జానీ, నాగార్జున రెడ్డి, నిఖిల్, నార్పల సత్య నారాయణ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సీతారాం ఏచూరి ఆదర్శ కమ్యూనిస్టు

అనంతపురం అర్బన్: విద్యార్థి ఉద్యమం నుంచి పేద ప్రజలు, కష్టజీవుల పక్షాన తుది శ్వాస వరకు నిలిచిన సీతారాం ఏచూరి ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఎం, సీపీఐ నాయకులు అన్నారు. సీతారాం ఏచూరి మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ సంతాపం తెలియజేశారు. ఆయన మృతి భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. గొప్ప మేధావిగా, ఆదర్శ పార్లమెంటేరియన్‌గా, అంతర్జాతీయ వ్యవహారాల దిట్టగా పేరుగాంచిన సీతారాం ఏచూరి తన యావత్ జీవితాన్ని సోషలిజం సాధనకు, కమ్యూనిష్టు ఉద్యమానికి ధారపోశారన్నారు.వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులను ఏకం చేసి 'ఇండియా' వేదికను ఏర్పాటు చేయడంలో ఆయన పాత్ర కీలమన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులు

భారత కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మృతి తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లప్ప, నాగేంద్రకుమార్, సావిత్రి మాట్లాడారు. తన తుది శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసిన గొప్ప నేత సీతారాం ఏచూరి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, ఆర్‌వీ నాయుడు, ప్రకాష్, వలి, చంద్రిక, సూర్యచంద్ర, చంద్రాయుడు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

'మంచి నాయకుడిని దేశం కోల్పోయింది'

అనంతపురం కార్పొరేషన్: వామపక్ష యోధుడు, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతితో ఓ మంచి నాయకుడిని దేశం కోల్పోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సీతారాం ఏచూరి మృతికి ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజా ఉద్యమానికి ఏచూరి మరణం తీరనిలోటని తెలిపారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి అడుగు పెట్టిన సీతారాం ఏచూరి నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మిక లోకానికి, లౌకిక వాదానికి ఏచూరి మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. పేదల కోసం జీవితాంతం ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. సీతారాం ఏచూరి రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన కాలంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నానని, ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.



సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్

ఏచూరి మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు

రాప్తాడు: కమ్యూనిస్టు యోధుడు, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం భారత వామపక్ష ఉద్యమానికి తీరని లోటని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం ఒక ప్రజా పోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. విద్యార్థి దశ నుంచే పోరాటాలు సాగిస్తూ, కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీలో స్థానం సంపాదించి 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై విలువలు, సిద్ధాంతాల కలబోతగా రాజకీయ ప్రస్థానాన్ని చివరి వరకూ కొనసాగించిన సీతారాం ఏచూరి ఆదర్శ ప్రాయుడన్నారు. ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ

అనంతపురం: జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో పోలీసులు గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్‌పాయింట్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించడతోపాటు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు.

రేపటి నుంచి 'స్వచ్ఛతా హి సేవ'

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఈ నెల 14వ తేదీ నుంచి గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పారిశుధ్య పనులు, ఓడీఎఫ్ ప్లస్ , గృహ నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు.

దండోరా నాయకుల నుంచి రక్షణ కల్పించండి

అనంతపురం టవర్‌క్లాక్: దండోరా నాయకుల నుంచి తమకు రక్షణ కల్పించాలని దామోదర సంజీవయ్య కాలనీవాసులు కోరారు. గురువారం స్థానిక కాలనీలో విలేకరులతో తమ గోడు వెళ్లబోసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ, దళిత, గిరిజన, మైనార్టీ కులాలకు చెందిన వారు కాలనీలో దాదాపు 400 గుడిసెలు వేసుకుని 8 నెలలుగా జీవిస్తున్నామన్నారు. అయితే దండోరా పేరు చెప్పి తమపై కొందరు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. గుడిసెలు ఖాళీ చేయకుంటే అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గుజ్జల శేఖర్, వెంకటేష్ గౌడ్, రాము, విశ్వనాథ్, పురుషోత్తం, రమేష్, సరస్వతి, విజయ లక్ష్మి, రాంబాయిమ్మ, వసుందర, సునిత, హసీనా, కవిత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇంటివద్దకే సరఫరా చేయాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

రాప్తాడురూరల్: గత ప్రభుత్వం లాగా పేదల ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం సరఫరా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. కొందరు డీలర్లు రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తూ పేదల కడుపు కొడుతున్నారంటూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు, అధికారులు కుమ్మక్కై అక్రమంగా రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్బన్ పరిధిలో ఉన్న స్టోర్లలో ఇప్పటికే బియ్యం, సరుకులు 74 శాతం సరఫరా చేశామని అధికారుల లెక్కలు చెబుతున్నా ఏయే ప్రాంతాల్లో ఎంతమంది లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేశారో తాము సర్వే చేసి రిపోర్ట్ తహసీల్దారుకు అందజేశామన్నారు. చాలా స్టోర్లలో 25 శాతానికి మించి ఇవ్వలేదన్నారు. తక్కిన రేషన్ ఎక్కడికి వెళ్లిందో అధికారులు లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్, వలి, రాజు, జీవా, వెంకటేష్, అంజి, డేవిడ్, రవి, బాషా, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం

• కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్స్ అసోసియేషన్



ర్యాలీగా వెళ్తున్న స్టాఫ్‌నర్సులు

అనంతపురం మెడికల్: తమను రెగ్యులరైజ్ చేయకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి నుంచి సప్తగిరి సర్కిల్, అక్కడి నుంచి తిరిగి సర్వజనాస్పత్రి వరకు స్టాఫ్‌నర్సులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు మాట్లాడుతూ తమను ప్రభుత్వం చులకనగా చూస్తోందన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇన్‌సర్వీస్ వారిని రెగ్యులర్ చేసేందుకు జీఓ విడుదల చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. సర్వజనాస్పత్రిలో రౌండ్ ద క్లాక్ షిఫ్టుల పద్ధతిలో స్టాఫ్‌నర్సులు సేవలందిస్తున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కడప, కర్నూలు, తదితర ప్రాంతాల నుంచి సైతం రోగులు సేవలు పొందుతున్నారన్నారు. కోవిడ్ వితప్కర పరిస్థితుల్లో కుటుంబాలను సైతం లెక్క చేయకుండా రోగుల ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా పని చేశామన్నారు. ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సులే 70 శాతం సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు అసోసియేషన్ అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు వెంకటేష్ నాయక్, సురేష్, సుదర్శన్, శోభ, నారాయణమ్మ, మానస, శ్రీవిద్య, శ్రీలక్ష్మి, నాజియా, మాధవి, త్రివేణి, స్వప్న, కళా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్‌పాసుల కేంద్రం ప్రారంభం

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్సు పాసులు పొందేందుకు బస్టాండు ఆవరణంలో కౌంటరును ప్రారంభించినట్లు స్టేషన్ మేనేజరు కే.ఎస్.మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన కౌంటరును ర్యాపిడో వారు వితరణ చేశారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సేవా దృక్పథంతో సాగుదాం

అనంతపురం: సామాజిక సేవా దృక్పథంతో అనంతపురం అడ్వొకేట్స్ వెల్ఫేర్ సొసైటీ సాగుతుందని సీనియర్ అడ్వొకేట్ సి.హనుమన్న అన్నారు. గురువారం స్థానిక పాతూరు టౌన్ హాలులో సొసైటీ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. హనుమన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యత్వ నమోదు, న్యాయవాదులకు ఇళ్ల స్థలాల మంజూరు తదితర వాటిపై చర్చించారు. ఇంటి స్థలాల కోసం జిల్లా జడ్జి ద్వారా కలెక్టర్‌కు పంపాలని తీర్మానించారు. కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్మన్ బాలాజీ నాయక్, ట్రెజరర్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి

రామగిరి: మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మీనుగ నాగమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులంటూ చాలామందికి పింఛన్లు అందించకపోవడం దారుణమన్నారు. ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా బైబిల్ మిషన్ వార్షికోత్సవం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ 7వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా సాగిన కార్యక్రమానికి పాస్టర్ల సంఘం అధ్యక్షులు రెవరెండ్ నెహెమ్యా నాగరాజు నేతృత్వం వహించారు. సంఘం జాయింట్ సెక్రటరీ పాస్టర్ వి మనుష్షే క్రీస్తు ప్రార్థనతో, పాస్టర్ నవీన్‌కుమార్ దైవగీతాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజమండ్రి బైబిల్ మిషన్ నుంచి విచ్చేసిన రెవరెండ్ ప్రశాంత్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. సామెతల గ్రంథం, పరిశుద్ధ స్థలాలు వంటి బైబిల్‌లోని పలు విషయాలను ఆసక్తికరంగా వివరించారు. విశ్వాసికి శాశ్వత ఆనందం మిగులుతుందన్నారు. క్రైస్తవులుగా పరిశుద్ధాత్మ స్వరూపుడైన క్రీస్తును ఘనపరచాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి శమంతకమణి, బైబిల్ మిషన్ ప్రతినిధులు రెవరెండ్ జాన్సన్, గవర్నింగ్ బాడీ సభ్యులు శామ్యూల్‌కిరణ్, జాన్ రాజేష్ తదితరులు ప్రసంగించారు. గౌరవ సలహాదారులు వైపీ బాబు, బందెల రాజు ,వాసు అనిల్ కాంత్, చల్లా కిషోర్ తదితరులు 21 మంది పాస్టర్లకు నగదు బహుమతులను, నూతన వస్త్రాలను అందించారు. పాస్టర్ ఫిలిప్ కుమారుడి వైద్య సాయం కోసం రూ.10,700 చెక్కునందించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్ల సంఘం ప్రతినిధులు మార్కు, మనుష్షే, జీఆర్ ఆనంద్, జీవన్‌బాబు, రూసఫ్‌కుమార్, శాంత వర్ధన్, జహంగీరు జాషువా తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

రాప్తాడు: 12వ పీఆర్‌సీకి సంబంధించి 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించి, జీఓ 117ను రద్దు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజినేయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల సేకరణ – ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణమోహన్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపు 'శ్రీ వేంకటేశ్వర వైభవం'

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 14న శ్రీ వేంకటేశ్వర వైభవం పేరిట ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగనుంది. ఈ మేరకు ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నారాయణనాయక్ తదితరులు గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి ఆహ్వాన పత్రాలనందించారు. గుత్తి రోడ్డులోని శ్రీ సెవెన్ ఫంక్షన్ హాలులో జరిగే కార్యక్రమాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలందుకోవాలని కోరారు.